# నమస్తే తెలంగాణ

## మహబూబ్‌నగర్

### నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 16 ఆగస్టు 2024 | MAHABUBNAGAR NARAYANPET




నారాయణపేట పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో జలియన్‌వాలాబాగ్ ఘటనపై ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

# మా తుర్యే సలాం

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో త్రివర్ణ రెపరెపలు
- ఊరూవాడా ఉప్పొంగిన దేశభక్తి
- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- సమరయోధుల కుటుంబాలకు సన్మానం
- ఉత్తమ సేవలందించిన వారికి ప్రతిభా పురస్కారాలు



మహబూబ్‌నగర్‌లో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు



గద్వాలలో చిన్నారుల ప్రభాతభేరి



గద్వాలలో..



నారాయణపేటలో..



మహబూబ్‌నగర్‌లో..



వనపర్తిలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు







*'మాతరం.. వందేమాతరం.. భారత్‌మాతాకీ జై.. గాంధీజీకి జై.. నేతాజీకి జై.. జై జవాన్.. జైకిసాన్.. జై తెలంగాణ' అన్న నినాదాలతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మార్మోగింది.. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం ఊరూవాడా ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే పురవీధుల మీదుగా ప్రభాతభేరి సాగింది. దేశ నాయకుల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు.. దేశభక్తిని పెంపొందించే నినాదాలతో సమరయోధులను స్మరించుకున్నారు.. మహబూబ్‌నగర్ పరేడ్ గ్రౌండ్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్‌లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, గద్వాలలో ప్రభుత్వ సలహాదారుడు జితేందర్‌రెడ్డి, నారాయణపేటలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, వనపర్తి కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రీతమ్ జాతీయ జెండాలను ఎగరవేశారు.. ఆయా జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులను సన్మానించారు.. ఉత్తమ సేవలందించిన వారికి ప్రతిభా పురస్కారాలను పంపిణీ చేశారు..*

*- మహబూబ్‌నగర్ నెట్‌వర్క్, ఆగస్టు 15*



నాగర్‌కర్నూల్‌లో వేషధారణలో విద్యార్థిని



బీఆర్ఎస్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న నిరంజన్‌రెడ్డి

## నిరుపేదలకు ఫలాలు అందాలి

- అప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లు..
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ) : స్వాతంత్ర్య ఫలాలు అత్యంత అట్టడుగున ఉండే పేదలకు అందినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద గురువారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో మహనీయులు, ఉద్యమకారులు బలిదానాలు, త్యాగాలు చేశారన్నారు. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే తెలంగాణ నవ నిర్మాణం సాధ్యమవుతుందని, ఈ ప్రక్రియ కాంగ్రెస్ ప్రభుత్వానికి సాధ్యం కాదన్నారు. గడిచిన తొమ్మిదేండ్లల్లో అగ్రరాష్ట్రాలతో పోటీపడి తెలంగాణను అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపామన్నారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు మనమంతా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, నాయకులు రమేశ్‌గౌడ్, అశోక్, రఘుపతిరెడ్డి, సామ్యానాయక్, పద్మ, వెంకటేశ్, మాణిక్యం, కృష్ణయ్య, సర్దార్‌ఖాన్, పరంజ్యోతి, నాగన్నయాదవ్, రవి, తిరుమల్, రహీం, గులాంఖాదర్, గౌస్, నీలస్వామి, రాము, గిరి, మధులత, సాయిలీల, కవిత తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్ క్యాంప్ కార్యాలయంలో జెండాను ఎగురవేసిన ఎమ్మెల్యే విజయుడు

## మహనీయుల త్యాగఫలమే స్వాతంత్ర్యం

- ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి, ఆగస్టు 15 : దేశ విముక్తి కోసం ఎందరో మహనీయులు చేసిన పోరాటాలు, వారి త్యాగాల ఫలితంగానే స్వాతంత్ర్యం వచ్చిందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే విజయుడు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ వారు భారత దేశానికి వ్యాపార నిమిత్తం వచ్చి ఇక్కడి సంపదను దోచుకున్నారు. వారి పాలనకు వ్యతిరేకంగా దేశంలో అనేక పోరాటాలు చేసి ఎంతో మంది దేశ నాయకులు ప్రాణాలను అర్పించారని వారిని ఎప్పుడూ మర్చిపోవద్దని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వనపర్తిలో..

## వృద్ధురాలిపై లైంగికదాడి

- ఊట్కూర్ మండలం పెద్దపొర్లలో ఆలస్యంగా వెలుగులోకి..

ఊట్కూర్, ఆగస్టు 15 : రాష్ట్రంలో ప్రజాపాలన గాడి తప్పింది. మహిళలు, చిన్నారులపై అరాచకాలు పెరిపోతున్నా ప్రభుత్వం, పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో 60 ఏండ్ల వృద్ధురాలిపై ఓ కామాంధుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూడటమే ఇందుకు నిదర్శనం. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక బీసీ కాలనీకి చెందిన వృద్ధ దంపతులు తమ కుమారులు బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లడంతో వ్యవసాయ పనులు చేసుకుంటూ పెద్దపొర్లలోనే ఉంటున్నారు. కాగా, భర్త నారాయణ ఈనెల 8వ తేదీన శ్రావణమాసం సందర్భంగా పూజా సామగ్రి కొనుగోలు చేస్తానని భార్య (60 ఏండ్ల వృద్ధురాలు)కు చెప్పి మక్తల్ వెళ్లాడు. మధ్యాహ్నం 3గంటల సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై ఇదే కాలనీకి చెందిన గ్రామ పంచాయతీ వాటర్‌మెన్ సత్యం ఇంట్లోకి చొరబడి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయాన్ని మూడు రోజుల తర్వాత భర్తకు ఆలస్యంగా తెలుపడంతో భార్యాభర్తలు ఇద్దరూ కలిసి ఈ నెల 11న ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిపై కేసు నమోదు కాకుండా గ్రామానికి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబంపై ఒత్తిడి తెస్తున్నారని, తమకు న్యాయం జరిపించాలని వృద్ధ దంపతులు వేడుకుంటున్నారు. ఈ విషయమై హెడ్‌కానిస్టేబుల్ సురేందర్‌ను వివరణ కోరగా ఫిర్యాదు తమకు అందిన విషయం వాస్తమమేనని, ఎస్సై సెలవులో ఉన్నందున ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినట్లు చెప్పారు.

## అడవి జంతువు మాంసం తరలింపు

- ముగ్గురిపై కేసు నమోదు, రిమాండ్ చేసిన అటవీ అధికారులు

అమ్రాబాద్, ఆగస్టు 15 : కరెంట్ తీగలతో అడవి జంతువును చంపి మాంసాన్ని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసి కల్వకుర్తి జైలుకు తరలించిన ఘటన మండలంలోని వంగూరోనిపల్లిలో గురువారం చోటుచేసుకున్నది. ఎఫ్ఆర్వో గురుప్రసాద్ కథనం మేరకు.. మండలంలోని వంగూరోనిపల్లి గ్రామంలో ఈ నెల 12వ తేదీన కరెంట్ తీగలతో అడవి జంతువు (కణతి)ను చంపి దాని మాంసాన్ని తరలిస్తున్న పిల్లి సాయిలు, జక్క నర్సింహారావు, కడారి అంజయ్యలను పట్టుకొని వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు. విచారణ నిర్వహించిన అనంతరం బుధవారం కోర్టులో వారిని హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధించి కల్వకుర్తి సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న వారిలో అటవీ అధికారులు వాణికుమారి, ఖాజామైనోద్దీన్, బీట్ అధికారులు నాగేశం, శారద, గోపాల్, సిబ్బంది వీరయ్య, లక్ష్మణ్, బాలకిష్టయ్య, బేస్‌క్యాంప్ వాచర్లు ఉన్నారు.



నిందితులతో అటవీశాఖ అధికారులు

## జూరాల @ 9 టీఎంసీలు

గద్వాల/అయిజ, ఆగస్టు 15 : జూరాల ప్రాజెక్టులో గురువారం ఇన్‌ఫ్లో 35 వేలు, అవుట్‌ఫ్లో 41,450 క్యూసెక్కులుగా నమోదైంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 9.091 టీఎంసీలుగా ఉన్నది. నెట్టెంపాడ్ లిఫ్టుకు 750, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 742, కోయిల్‌సాగర్‌కు 630, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 500, భీమా లిఫ్ట్-2కు 750, విద్యుదుత్పత్తికి 37,814 క్యూసెక్కులను వదిలారు.

***టీబీ డ్యాంలో..***

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలో ఇన్‌ఫ్లో 37,173, అవుట్‌ఫ్లో 1,10,614 క్యూసెక్కులుగా నమోదైంది. పూర్తి స్థాయి నీటి నిల్వ 105.788 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 77.211 టీఎంసీల నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు 1,10,416 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 1,09,800 క్యూసెక్కుల నీరు సుంకేసుల బ్యారేజీకి చేరుతున్నది. ఆయకట్టుకు 616 క్యూసెక్కులు వదలగా.. ప్రస్తుతం ఆనకట్టలో 13.2 అడుగుల మేరకు నీటి మట్టం ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో 33,123, అవుట్‌ఫ్లో 17,475 క్యూసెక్కులు ఉండగా.. ప్రస్తుతం 126.38 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 14,291, అవుట్‌ఫ్లో 14,752 క్యూసెక్కులు నమోదు కాగా.. ప్రస్తుతం 37.54 టీఎంసీల నిల్వ ఉన్నది.

## ఆటోను ఢీకొన్న లారీ

- ఇద్దరు మృతి, ఒకరి పరిస్థితి విషమం
- 15 మందికి తీవ్ర గాయాలు

ఉండవెల్లి, ఆగస్టు 15 : కూలీలతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా 16 మందికి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా ఈ తాండ్రపాడు గ్రామానికి చెందిన 18 మంది కూలీలు ఉదయం 9 గంటలకు ఆటోలో ఉండవెల్లి మండలం కంచుపాడులో మిరపపంట కలుపు తీసేందుకు జాతీయ రహదారి మీదుగా వస్తున్నారు. ఉండవెల్లి శివారు వరసిద్ధి వినాయక పత్తి మిల్లు దగ్గరికి రాగానే ఐరన్ మట్టి లోడ్‌తో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఆటోను ఢీకొట్టింది. లారీ ఆటోను దాదాపు 200 మీటర్లు ఈడ్చుకొని పోవడంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవి (56) అక్కడికక్కడే మృతి చెందగా రమాదేవి (40) కర్నూల్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అనిత పరిస్థితి విషమంగా ఉన్నది. అదేవిధంగా పావని, లక్ష్మీదేవి, వరలక్ష్మి, టీ పావని, ప్రియాంక, కే వరలక్ష్మి, నందు, రాధ, లక్ష్మీదేవి, పద్మ, నర్సింహ(ఆటో డ్రైవర్)తోపాటు మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షత గాత్రులను 108, హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు.



లారీ ఢీకొనడంతో బోల్తా పడిన ఆటో

## సెల్‌ఫోన్ చూస్తూ..

- సాంబర్ మీద పడేసుకున్న బాలుడు
- తీవ్ర గాయాలు, దవాఖానకు తరలింపు

దేవరకద్ర, ఆగస్టు 15 : ఓ బాలుడు ఫోన్ చూస్తూ సాంబర్ గిన్నెపై పడడంతో సాంబర్ మీదపడి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం మండలంలోని బల్సుపల్లిలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దాదాపు 40 మంది కూలీలు బల్సుపల్లి గ్రామంలో పత్తి చేనులో కూలి పనులు చేసేందుకు వచ్చారు. కాగా గురువారం ఉదయం వంటలు చేస్తుండగా పద్మ, లక్ష్మయ్య కుమారుడు శశాంక్ సెల్‌ఫోన్ చూసుకుంటూ నడుస్తుండగా.. పొయ్యిపై ఉన్న సాంబర్ గిన్నెకు తగిలాడు. దీంతో సాంబర్ మొత్తం బాలుడిపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కూలీలు బాలుడిని దేవరకద్ర పీహెచ్‌సీ తరలించగా బాలుడి శరీరం 60శాతం కాలిపోవడంతో వైద్యుడు శరత్‌చంద్ర మెరుగైన చికిత్సకోసం జిల్లా దవాఖానకు తీసుకెళ్లాలని సూచించగా అక్కడి నుంచి మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించారు.


